సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.56 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 8.56 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 620 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.74,690
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,689
3శాతం జీఎస్టీతో	రూ.6,912
నవర (8గ్రా)	రూ.55,296



ముమ్మరంగా తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. నగదు, మద్యం అక్రమ రవాణా కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. వివిధ రకాల వ్యాధులను అరికట్టే విధానంపై నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు డివిజన్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంచి ఆరోగ్యానికి పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితరాలు కీలకమనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. డాక్టర్లు నవీన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, బాలచంద్రబాబు, శ్రీనివాసులు, డాక్టర్లు వాసవి, శ్రావణి, హసన్‌కుమార్, గోపీకృష్ణ, డెమో అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తమిళనాడులో ఎన్నికలకు జిల్లా పోలీసులు

నెల్లూరు(క్రైమ్): లోక్‌సభ ఎన్నికలు తమిళనాడులో ఈ నెల 19న నిర్వహించనున్న తరుణంలో జిల్లాకు చెందిన 350 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిమిత్తం వెళ్లారు. పోలీస్ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో వీరు సోమవారం పయనమయ్యారు.

సప్లిమెంటరీ ఫీజును 24లోపు చెల్లించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు.. రీ వెరిఫికేషన్.. రీకౌంటింగ్‌కు సంబంధించిన ఫీజులను ఈ నెల 24లోపు చెల్లించాలని ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోపు విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించేలా ప్రిన్సిపల్స్ చర్యలు చేపట్టాలని కోరారు.

మద్య రహిత ఎన్నికలే లక్ష్యం



సమావేశాన్ని నిర్వహిస్తున్న అరుణ్‌రావు

నెల్లూరు(క్రైమ్): మద్య రహిత ఎన్నికలకు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ అరుణ్‌రావు ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలపై ఎస్‌ఈబీ, పోలీస్ అధికారులతో సమావేశాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చాక నిర్వహించిన దాడులు, నమోదైన కేసులు, అరెస్ట్‌లు, బైండోవర్లు, సీజ్ చేసిన మద్యం, నాటుసారా తదితరాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళికి కట్టుబడి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. మద్యం అక్రమ రవాణా, అనధికార నిల్వలు, నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై ఆకస్మిక దాడులు జరిపి సీజ్ చేయాలని సూచించారు. మద్యం అక్రమ సరఫరా కేసుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందినీ బాధ్యులను చేయాలని ఆదేశించారు. వాహన తనిఖీలను ముమ్మరం చేసి పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి రాకుండా కట్టడి చేయాలని కోరారు. 2014, 2019 ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఎస్‌ఈబీ నెల్లూరు – 1 స్టేషన్, మనుబోలు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఎస్‌ఈబీ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు, ఏఎస్పీ సౌజన్య, ఎస్‌ఈబీ ఏసీ దయాసాగర్, ఈఎస్ బాబుశ్రీధర్, ఏఈఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాలా అండగా ఉంటాం

నెల్లూరు (సెంట్రల్): రైతులకు సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు అందిస్తూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు అండగా ఉంటారని వ్యవసాయ పరిశోధన సంచాలకులు ప్రశాంతి పేర్కొన్నారు. నగరంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణపై గ్రామాలకెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. నెల్లూరుతో పాటు ఇతర జిల్లాల్లో రబీ సీజన్‌లో వరి, ఉద్యాన పంటలను ఎక్కువగా సాగు చేస్తారని, వీటిపై దృష్టి సారించాలని సూచించారు. అధికారులు ఎస్సెస్ నాయక్, కోదండ రామిరెడ్డి, వినీత తదితరులు పాల్గొన్నారు.

.. కింకర్తవ్యం



డబ్బుతో ఏమైనా చేసేయొచ్చనే కొందరి అంచనాలు తారుమారవుతున్నాయి. నగదును వెదజల్లి తద్వారా గెలవొచ్చనే టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అంచనాలు ప్రజాక్షేత్రంలో తలకిందులవుతున్నాయి. తన విజయం అంత సులభం కాదనే విషయం బోధపడటం.. పైగా వ్యూహాలు బెడిసికొడుతుండటంతో ఏమి చేయాలో పాలుపోక తల పట్టుకోవడం ఆమె వంతవుతోంది.

కోవూరులో బెడిసికొడుతున్న టీడీపీ వ్యూహాలు

- డబ్బుతో గెలుపు సులభమనుకున్న ప్రశాంతిరెడ్డి
- విజయంపై నమ్మకం లేక అంతర్మథనం
- రచ్చగా మారుతున్న ప్యాకేజీ రాజకీయాలు
- దుమారం రేపుతున్న ఆడియో
- పార్టీ శ్రేణుల్లో నానాటికీ పెరుగుతున్న కుమ్ములాటలు

కోవూరు: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కోవూరు నియోజకవర్గంలో టీడీపీకి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. నగదు ప్రలోభాలతో నేతలను టీడీపీలో చేర్చుకోవడం.. దురాయి పేరుతో మత్స్యకార గ్రామాలు.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్యాకేజీలను వేమిరెడ్డి దంపతులు ప్రకటించడం.. ఈ విషయాలు బయటకు పొక్కడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఎక్కడికెళ్లినా సమస్యల స్వాగతం

ప్రచారంలో భాగంగా ప్రశాంతిరెడ్డి ఎక్కడికెళ్లినా సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ఓ వైపు వర్గపోరు.. మరోవైపు నేతల మధ్య సమన్వయం కొరవడటంతో ఆమె చేతులెత్తేశారు. ఆత్మీయ సమావేశాలు.. ప్రచారాలు.. పార్టీ కార్యాలయాల ప్రారంభం.. ఇలా సందర్భమేదైనా గొడవలు మాత్రం కామన్‌గా మారుతున్నాయి. కోవూరు టీడీపీ సీటును ఆశించి భంగపడిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి.. ప్రశాంతిరెడ్డి విజయానికి పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నారు. అయితే ఇందులో ఎంత వాస్తవమో అర్థం కాని పరిస్థితి. టీడీపీలో ప్రస్తుతం జరుగుతున్న కుమ్ములాటలకు వెన్నుపోటు రాజకీయాలే కారణమనే ప్రచారం జరుగుతోంది.

అడుగడుగునా ప్రతికూలతలే..

క్షేత్రస్థాయిలో టీడీపీకి అనుకూల వాతావరణం లేదు. చంద్రబాబు గత పాలనను ప్రజలు నేటికీ మర్చిపోలేదు. రుణ మాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా మహిళలను గతంలో ఆయన మోసగించారు. తాజాగా టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోను ఎవరూ నమ్మడం లేదు. మరోవైపు వలంటీర్ల సేవలను ఎన్నికల కమిషన్ ద్వారా చంద్రబాబు అడ్డుకోవడం బూమరాంగ్ అయింది. చంద్రబాబు వ్యూహాలు, గత పాలన టీడీపీ అభ్యర్థులకు శాపంగా మారాయి.

ఆడియో కలకలం

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోదరుడు రాజేంద్రనాథ్‌రెడ్డితో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల ఫోన్లో మాట్లాడిన సంభాషణ ఆడియో బయటకు రావడం కలకలం సృష్టిస్తోంది. తాము గెలిస్తే ప్రజల్లో ఉంటామని.. ఓటమిపాలైతే వ్యాపారాలు చూసుకుంటామని ఆమె చెప్పడం చర్చనీయాంశంగా మారింది. నిత్యం వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమయ్యే వేమిరెడ్డి దంపతులు గెలిచినా.. ఓడినా ప్రజల్లో ఉండరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆడియో దుమారంతో వీరిపై నమ్మకం మరింత సన్నగిల్లింది.

సైకిల్‌పై ఉండలేమబ్బా..!

టీడీపీలో ఉక్కపోత

- వైఎస్సార్‌సీపీలోకి తిరిగొచ్చేస్తామంటున్న నేతలు
- తాజాగా చేజర్ల సుబ్బారెడ్డి చేరిక



విజయసాయిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన చేజర్ల సుబ్బారెడ్డి

ఉదయగిరి: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. టీడీపీ అధికారంలోకి వస్తుందంటూ ఆ పార్టీ పెయిడ్ గ్యాంగ్‌తో చేయించిన మౌత్ టాక్ బెడిసికొడుతోంది. తెలిసో.. తెలియకో.. ఇతర కారణాలతో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన నేతలు అక్కడ ఇమడలేక ఒక్కొక్కరూ సొంత గూటికి క్యూ కడుతున్నారు. ఊహించని పరిణామాలతో టీడీపీ నేతలు దిక్కుతోచక నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. టీడీపీ అధికారంలోకి రానుందంటూ ఆ పార్టీ అధినేత చంద్రబాబు బూటకపు ప్రసంగాలు చేయడంతో పాటు ఇదే అంశమై ఎల్లో మీడియా.. పెయిడ్ గ్యాంగ్‌లతో ప్రచారాలకు యత్నించారు. ఈ విష వలయంలో చిక్కి కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. అయితే వారికి అక్కడ సముచిత స్థానం.. కనీస మర్యాదా లభించలేదు. దీంతో సొంత పార్టీని వీడి తప్పు చేశామని వారు మదనపడుతున్నారు.

బస్సుయాత్రకు బ్రహ్మరథం

ఇడుపులపాయ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రతో క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న పట్టు అర్థమైంది. యాత్రలో జగనన్నకు జనం బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో టీడీపీ ఆడిన మైండ్‌గేమ్‌లో పడి, తాము చేసిన తప్పును తెలుసుకున్న చాలా మంది తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు. దీనికి చక్కటి ఉదాహరణగా నెల్లూరు జిల్లాను తీసుకోవచ్చు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన వ్యక్తిగత కారణాలతో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో వేమిరెడ్డి ఉన్న సమయంలో జిల్లాలో చాలా మంది నేతలు ఆయనతో సన్నిహితంగా ఉండేవారు. దీంతో వేమిరెడ్డి పార్టీ మారిన సమయంలో ఆయనపై అభిమానం.. ప్రేమతో కొంతమంది వైఎస్సార్‌సీపీకి దూరమయ్యా రు. అయితే అక్కడికి వెళ్లాక అవమానాలకు గురవుతున్నారు. వీపీఆర్‌ను నమ్ముకొని తాము పార్టీ మారామని.. అయితే టీడీపీలో ఆయనకే తగిన గౌరవం లేదని.. తమ సంగతి దేవుడెరుగని మదనపడుతున్నారు. ఈ పరిణామాలతో వైఎస్సార్‌సీపీ.. తమ అభిమాన నేత జగనన్నపై ప్రేమ చంపుకోలేక అనేక మంది సొంత గూటికి చేరుకుంటున్నారు. తాజాగా ఉదయగిరి నియోజకవర్గ ముఖ్యనేత, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి తన ముఖ్య అనుచరులతో కలిసి పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. జిల్లాలో ఇప్పటికే బలమైన నేతలు, కేడర్ లేక సతమతమవుతున్న టీడీపీ ఈ పరిణామాలతో మరింత బలహీనమవ్వడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- 18న ప్రక్రియ ప్రారంభం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభంకానుందని, దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. కలెక్టరేట్లోని మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు అయా ఆర్వో కార్యాలయాల్లో.. లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్లోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నామని వెల్లడించారు.

ఓటింగ్ శాతం పెంపే లక్ష్యం

జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఎపిక్ కార్డుతో పాటు పది రకాల గుర్తింపు కార్డుల్లో దేన్నైనా చూపి ఓటును వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈసీఐ పాసులు పొందిన పాత్రికేయులకు సైతం పోస్టల్ బ్యాలెట్‌ను కల్పించనున్నామని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్లు మే మూడున ప్రింట్ కానున్నాయని, కేటగిరీల వారీగా వీటిని అందజేయనున్నామని చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు ఉందో తెలియజేసేలా చర్యలు చేపట్టామన్నారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

పత్రికల్లో రాజకీయ ప్రకటనలిచ్చే వారి వివరాలను ప్రచురించాలని చెప్పారు. ప్రకటన ప్రచురితమైన మూడు రోజుల్లో డిక్లరేషన్‌ను జిల్లా మేజిస్ట్రేట్‌కు అందజేయాలని చెప్పారు. కరపత్రాలు పోస్టర్లను ముద్రించే వారు సైతం డిక్లరేషన్ ఇవ్వాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

జిల్లాలోని 18 చెక్‌పోస్టులతో పాటు ఎస్సెస్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2.63 కోట్ల నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశామని చెప్పారు. రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తుంటే తగిన ఆధార పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు. రూ.పది లక్షల్లోపు నగదు పట్టుబడితే జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీ పరిశీలించి సరైన ఆధారం ఉంటే విడుదల చేస్తున్నామన్నారు. రూ.పది లక్షలు దాటితే ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 35 కేసులను పరిష్కరించగా, 23 స్క్రూటీన్లో ఉన్నాయని తెలిపారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి సదారావు, సమాచార శాఖ ఇంజినీర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇవీ ముఖ్య తేదీలు..

- ప్రభుత్వ సెలవు దినాల మినహా ఈ నెల 18 నుంచి 25 వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నామని కలెక్టర్ చెప్పారు.
- 26న నామినేషన్ల స్క్రూట్నీని చేపట్టనున్నామన్నారు.
- నామినేషన్ల ఉపసంహరణకు 29 వరకు గడువు ఉంటుందని తెలిపారు.
- అనంతరం పోటీలో నిలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు.
- పోస్టల్ బ్యాలెట్లు, శిక్షణ తదితర ఎన్నికల కార్యకలాపాలు మే 12 వరకు కొనసాగనున్నాయని వివరించారు.
- పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్లు, స్టేషనరీ తదితర పోలింగ్ సామగ్రిని మే 12న అందజేయనున్నామని వెల్లడించారు.
- మే 13న పోలింగ్ ప్రక్రియ జరగనుందని తెలిపారు.

ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలు పరిష్కరిస్తా

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులతో నగరంలోని కస్తూరిదేవి ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయు లు, సిబ్బందికి హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల విష యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో మహిళల అక్షరాస్యత శాతం పెరగాల్సి ఉందన్నా రు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచడంలో ప్రైవేట్ విద్యాసంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయ ని కొనియాడారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం శ్రీకారం చుట్టారని చెప్పారు. అనంతరం పార్టీ సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. సామాన్య వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్‌ను ఇచ్చి గౌరవించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నా రు. ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఆపస్మా రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఉపాధ్యాయులు, సిబ్బంది

స్మార్ట్ సిటీగా నెల్లూరును తీర్చిదిద్దుతాం



విజయసాయిరెడ్డి, సునంద దంపతులు, కుమార్తెకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరును సుందరంగా.. స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 50వ డివిజన్లో గల సంతపేట, మార్కెట్ సెంటర్‌లో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి సోమవారం నిర్వహించిన విజయసాయిరెడ్డి మాట్లాడారు. విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న నెల్లూరును పచ్చదనం.. పరిశుభ్రతకు కేరాఫ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎంపీగా గెలుపొందాక నెల్లూరులో సమస్యల పరిష్కారానికి కేంద్రం నుంచి నిధులను తీసుకొచ్చేందుకు అధిక ప్రాధాన్యమిస్తానని తెలిపారు. పార్కులు, క్రీడా మైదానాల అభివృద్ధి, భూగర్భ డ్రైనేజీ పథకాన్ని పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తానని వెల్లడించారు. ఎంపీగా దేశ రాజధానిలో కొన్ని వారాలు గడుపుతూనే.. నెల్లూరు నగర వాసిగా ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. నిరుద్యోగం.. మురికివాడల్లేని నెల్లూరును తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సామాన్యుడికి నెల్లూరు సిటీ టికెట్‌ను కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

అనేక అభివృద్ధి పనులు

గడిచిన ఐదేళ్లలో 50వ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని తెలిపారు. రూ.33.75 కోట్లను ప్రజల కోసం ప్రభుత్వం వెచ్చించిందని వెల్లడించారు. రంగనాయకులపేట సమీపంలో రజకుల కోసం ధోబీ ఘాట్‌ను నిర్మిస్తామని, ఘోషాస్పత్రి ఏర్పాటు కోసం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద భూమిని కేటాయించామన్నారు. డివిజన్ ఇన్‌చార్జి కొణిదెల సుధీర్ అన్ని వర్గాలను సమీకరిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- 50వ డివిజన్లో విజయసాయిరెడ్డి ప్రచారం నిర్వహిస్తుంటే.. ఆయన సతీమణి సునంద, కుమార్తె నేహారెడ్డి ప్రచారం సాగించారు.

అనంతజనసాగరం

- ఆత్మీయ సభ సూపర్ సక్సెస్
- పోటెత్తిన అభిమానులు



ప్రజలకు నమస్కరిస్తున్న విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్ / సోమశిల: మేమంతా సిద్ధం పేరుతో అనంతసాగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ప్రజలు నీరాజనాలు పలికారు. పార్టీ అభిమానులు, ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో సమావేశానికి తరలివచ్చారు. పార్టీకి కంచుకోటైన అనంతసాగరం మండలంలో మేకపాటి వెన్నంటే నడుస్తామని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పేర్కొన్నారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పార్టీ ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. అనంతసాగరం జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, పార్టీ జిల్లా నేతలు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, రాపూరు సుందరరామిరెడ్డి తదితరులు తమ అభిమాన గణాన్ని కార్యక్రమంలో పాల్గొనేలా చేయడంతో ఆత్మీయ సమావేశం సూపర్ సక్సెస్‌గా నిలిచింది.

నేర చరిత్రకు కేరాఫ్ చంద్రబాబు

నేర చరిత్రకు చంద్రబాబు చిరునామాలాంటి వారని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీ.. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. ఆత్మక్షోభతో ఎన్టీఆర్ మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. వంగవీటి మోహనరంగాను ఆయన నరికి చంపించిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. చంద్రబాబు అరాచకాలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. కొద్ది రోజుల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు స్వీకరించనున్నారని వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాల ద్వారా అనంతసాగరం మండలానికి జరిగిన మేలును తెలియజేశారు.

జగనన్న వెంటే ప్రజలు

ఎవరెన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తిరుగులేదని మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం ఖాయమని అన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. సీఎంను అంతం చేసేందుకు తెగబడటం టీడీపీ కూటమి పతనానికి నాంది పలికిందని వివరించారు.

గజమాలలు.. మంగళహారతులు

అనంతసాగరంలోని బద్వేల్ రోడ్డు సెంటర్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు గజమాలలు వేసి ప్రజలు మంగళహారతులు పట్టారు. పూల వర్షం.. బాణాసంచా మోతలతో యాత్ర దిగ్విజయంగా సాగింది. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పెయ్యల సంపూర్ణమ్మ, పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, సద్దా రవీంద్రరెడ్డి, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శోభమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 1070 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 1070 బేళ్లను సోమవారం విక్రయించారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1170 బేళ్లు రాగా, 1070 విక్రయం కాగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. వేలంలో 1,35,248 కిలోల పొగాకు విక్రయం కాగా, రూ.3,10,68,287 వ్యాపారం జరిగిందన్నారు. గరిష్ఠ ధర కిలో రూ.251.. కనిష్ఠ ధర రూ.220.. సగటు ధర రూ.229.71గా నమోదైందని వివరించారు. వేలానికి 16 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీకి శేషారెడ్డి గుడ్‌బై


మాట్లాడుతున్న శేషారెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలో ఓ కల్యాణ మండపంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాను తొలుత పంటపాళెం సర్పంచ్‌గా పనిచేశానన్నారు. 1978 – 83, 1989 – 94 సర్వేపల్లి ఎమ్మెల్యేగా వ్యవహరించానన్నారు. 1994, 1999లో ఆ పార్టీ తరఫున పోటీ చేశానన్నారు. పది సంవత్సరాలు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, మూడేళ్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా పనిచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో చేయలేనన్నారు. సమావేశంలో కనకట్ల రఘురాం ముదిరాజ్, హర్షవర్ధన్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు


తీవ్రంగా గాయపడిన సంజు సింగ్

వింజమూరు(ఉదయగిరి): విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వింజమూరు సబ్‌స్టేషన్ ప్రాంతంలో 167 – జీబీ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోంది. అక్కడ విద్యుత్ పనులు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన కార్మికుడు సంజు సింగ్‌కు షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనలో శ్రీరామనవమి వేడుకలు రేపు



రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను నిర్వహించనున్నట్లు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, కల్యాణోత్సవం, సాయంత్రం హనుమంత సేవ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

సీఎం వైఎస్ జగన్‌పై చంద్రబాబు కుట్రలు


మర్రిపల్లిలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కోలేక చంద్రబాబు నాయుడు కూటమి కట్టాడు. దాని వల్ల కూడా కాదని గ్రహించి కుట్రలకు తెరతీశాడు. ఏకంగా సీఎంను అంతమొందించాలని చూశాడు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపల్లి, కొనగలూరు, రామాపురం, దుగ్గుంట, దుగ్గుంటరాజుపాళెం, ఊట్లపాళెం, కొత్తకంభాలపల్లి గ్రామాల్లో మంత్రి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపల్లిలో మాట్లాడుతూ రోజురోజుకు తన గ్రాఫ్ పడిపోతుండడంతో చంద్రబాబు హత్యా రాజకీయాలకు బరితెగించాడని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం చూసి ప్రజలు ఓట్లు వేస్తారని, ఇది జీర్ణించుకోలేకే బాబు దారుణాలకు ఒడిగడుతున్నాడన్నారు. పేదలకు మేలు చేయాలనే జగన్ సంకల్పాన్ని ఎవరూ ఆపలేరన్నారు.

సోమిరెడ్డిని అడగండి

ఐదేళ్లకొక పర్యాయం గ్రామాలకు వచ్చే టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓటేస్తారా? గ్రామాలను అభివృద్ధి చేసిన తనకు ఓటేస్తారా? అని కాకాణి ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో ఆయన ఎక్కడ ఉన్నాడో అడిగి తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వేపల్లిలో రూ.130 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లను నిర్మించామని, రూ.375 కోట్లతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించానని మంత్రి వెల్లడించారు. రూ.100 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇన్ని చేసిన తనను ఆశీర్వదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్‌లు కోసూరు అంకమ్మ, వెంకటరమణయ్య, ఎంపీటీసీలు రావుల దశరథరామయ్యగౌడ్, కేతు రామిరెడ్డి, నాయకులు రావుల అంకోజీ, జి.గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

వింజమూరు(ఉదయగిరి): 'టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి ఓటమి భయం పట్టుకుంది. అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంతమొందించాలని కుట్ర పన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం' అని ఉదయగిరి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జనార్ధనపురం, చాకలికొండలో సోమవారం సాయంత్రం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మేమంతా సిద్ధం యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో ఓర్వలేక టీడీపీ కూటమి కుట్రలకు పాల్పడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పాలన్నారు. దేవుడు, ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. టీడీపీ పాలనలో ఇచ్చిన ఒక్క హామీ కూడా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు డేగా వంశీ, పార్టీ మండలాధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఎం.విజయ్‌రెడ్డి, పల్లాల కొండారెడ్డి, కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, రవిచంద్ర, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కావలిని కనకపట్నం చేయడమే ధ్యేయం


ఎన్నికల క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి: కావలిని కనకపట్నంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పట్టణంలో ఎన్నికల క్యాంప్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే కావలి సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. కావలి నుంచి అత్యధిక మెజారిటీ సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా త్వరలోనే అన్ని వార్డుల వారీగా కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండేందుకు, పార్టీలో చేరికలను ప్రోత్సహించేందుకు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మంచి చేసి ఉంటేనే ఓటు వేయమని అడిగిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లల్లో అందించగలిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కలిమిలికి సముచిత స్థానం


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీలో కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని ఆ పార్టీ పరిశీలకుడు మక్కిలి రామచంద్రారెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోనన్‌రెడ్డి ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనంజయరెడ్డి, రూరల్ నాయకుడు తంబిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగిందని ఆ పార్టీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని కందమూరు దళితవాడ నుంచి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించాక రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయన్నారు. ప్రతి ఒక్కరూ తేడాను గమనించి రానున్న ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ దాడికి నిరసనగా ఆదాల, నాయకులు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, బూడిద విజయ్‌కుమార్, సుధీర్‌కుమార్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, గునపాటి శ్రీనివాసులురెడ్డి, మహేష్ నాయుడు, గడుపూడి శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోనే ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా

- నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్


కరపత్రం అందజేస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజల్లోనే ఉండి సమస్యలను పరిష్కరిస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 6వ డివిజన్ మిషన్ తోట, శివాజీనగర్, ప్రకాష్ నగర్, శెట్టిగుంటరోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అన్నారు. చంద్రబాబు నాయుడు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని చెప్పారు. టీడీపీకి ప్రజలు ఓట్లతో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. గతంలో శెట్టిగుంటరోడ్డు ఎలా ఉందో.. ప్రస్తుతం ఎలా ఉందో స్థానికులు గమనించాలన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు

- నగదు, మద్యం స్వాధీనం


వాహన తనిఖీలు చేస్తున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి గాంధీబొమ్మ సెంటర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఓ వస్త్ర దుకాణానికి చెందిన ఎస్.శ్రీనివాసులు ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకుండా తన వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.9,90,071ను స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ తన సిబ్బందితో కలిసి వినాయకగుడి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఏసీ నగర్ కోదండరామపురానికి చెందిన బిల్డర్ కె.మోహన్ తన వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.5 లక్షలను పట్టుకున్నారు. నగదును ట్రెజరీలో అప్పగిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. రాపూరు పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.29 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

338 మద్యం బాటిళ్లు

మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా పోలీసు, సెబ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ఆది, సోమవారాల్లో గుడ్లూరు పోలీసుస్టేషన్ పరిధిలో 68, వెంకటాచలసత్రంలో 12, సైదాపురంలో 14, కలిగిరిలో 6, ఎస్‌ఆర్‌పురంలో 10, కందుకూరు పరిధిలో 13 మద్యం బాటిళ్లు, సెబ్ అధికారులు 215 మొత్తంగా 338 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. మద్యం, నగదు అక్రమ రవాణా, పంపిణీ తదితరాలను గుర్తిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 142	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 280
లేయర్ (లైవ్)	: 98		
బ్రాయిలర్ చికెన్	: 250	లేయర్ చికెన్	: 167

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.75
సన్నవి : రూ.60
పండ్లు : రూ.26

